క్లుప్తంగా

గోదాదేవికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో గోదాదేవికి సోమవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని గోదాదేవికి పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను చేపట్టారు. గోదాదేవికి నిర్వహించిన అభిషేకాలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు రత్నమాచార్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అధికారిక కబడ్డీ సంఘం మాదే

ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్‌లో కబడ్డీ ఆటను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తమ అసోసియేషన్ పని చేస్తోందని ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి చెప్పారు. ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం ఆయన విలేకరులతో మట్లాడుతూ తమ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీగా ఉన్న యలమంచిలి శ్రీకాంత్ ఈ ఏడాది మే 17న తనకు తెలియకుండా అసోసియేషన్ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నట్లుగా ప్రకటించారన్నారు. 2023లో ఎన్నుకున్న అసోసియేషన్ పదవీ కాలం 2027 వరకు ఉందని, ఈ విషయాన్ని వివరిస్తూ తాను హైకోర్టులో కేసు వేశానన్నారు. శ్రీకాంత్ ప్రకటించిన అసోసియేషన్ ఎన్నిక చెల్లదని ఏపీ హైకోర్టు ఈ నెల 18న తీర్పు ఇచ్చిందన్నారు. తమదే అధికారిక అసోసియేషన్ అని వెంకటరెడ్డి చెబుతూ కోర్టు తీర్పు ప్రతులను మీడియాకు చూపించారు.

వ్యాయామ విద్య విభాగాధిపతికి రెండు స్వర్ణ పతకాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ డీ యుగంధర్ 9వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్-డిస్ట్రిక్ట్ మోడ్రన్ పెంటాథ్లాన్ చాంపియన్‌షిప్ 2025, 2వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్-డిస్ట్రిక్ట్ మోడ్రన్ పెంటాథ్లాన్ చాంపియన్‌షిప్ 2025లో రెండు స్వర్ణ పతకాలు గెలిచి విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచారు. కృష్ణా జిల్లా మోడ్రన్ పెంటాథ్లాన్ అసోసియేషన్, బ్లూమింగ్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్తంగా ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనతో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణపతకాలను యుగంధర్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె భాగ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పీ శైలజ కళాశాల అధ్యాపకులు యుగంధర్‌ను అభినందించారు.

బీరువాలోని రూ.5 లక్షలు చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీరువా తాళాలు పగలగొట్టి రూ.5 లక్షలు చోరీ చేసిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టీనర్‌పేట అడ్డరోడ్డు ప్రాంతానికి చెందిన కొండ కృష్ణ ఓ ప్రైవేటు లారీ సర్వీసులో పని చేస్తుంటాడు. కృష్ణ కొత్త ఇల్లు నిర్మాణం కోసం కొద్ది రోజుల కిందట తెలిసిన వారి వద్ద నుంచి రూ.5 లక్షలు అప్పుగా తెచ్చాడు. తెచ్చిన డబ్బులను ఇంట్లో బీరువాలో భద్రపరిచాడు. సోమవారం ఉదయం బాబును స్కూల్‌కు పంపి, భార్యతో కలిసి కాకాని తోటకు వెళ్లాడు. సాయంత్రం భార్య ఫోన్ చేసి ఇంట్లో బీరువా పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారని చెప్పింది. దీంతో హుటాహుటినా ఇంటికి వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స కన్నా నివారణ మేలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): చికిత్స కన్నా నివారణ మేలు అని .. వ్యాధి వచ్చిన తరువాత చికిత్స తీసుకోవటం కంటే ముందుగానే వ్యాక్సిన్ వేయించుకోవటం మంచిదని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ శైలజ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో సోమవారం వరల్డ్ హెపటైటిస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 2030లోపు హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంపై విద్యార్థులకు వివరించారు. అధ్యాపకుడు నాగేశ్వరరావు టీకాల ప్రాముఖ్యతను తెలియజేశారు. అధ్యాపకురాలు సయ్యద్ వాజిహా తహసీన్ కాలేయం ఎలా జీవరసాయన శక్తి కేంద్రంగా పనిచేస్తుందో వివరించారు.

స్విమ్మింగ్‌పై పెరుగుతున్న ఆసక్తి

- జాతీయ పోటీల్లో రాణించేలా శిక్షణ
- సత్ఫలితాలను ఇస్తున్న ప్రత్యేక శిబిరాలు



స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పోటీ ప్రపంచంలో తమకు ఏదైనా ప్రత్యేక గుర్తింపు కావాలనుకునే వారు వారి కంటీ ఓ ప్రత్యేకమైన అంశంలో శిక్షణ పొందుతారు. ఒకప్పుడు కేవలం స్విమ్మింగ్ అంటే సరదా... ఆ తర్వాత ఆరోగ్యం కోసం శిక్షణ పొందేవారు.. అయితే ఇప్పుడు చిన్నారులు, యువత స్విమ్మింగ్‌లో రాణించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని భావిస్తున్నారు. స్విమ్మింగ్‌లో రాణిస్తున్న సీనియర్ స్విమ్మర్లను ఆదర్శంగా తీసుకుని ముందుకు దూసుకుపోతున్నారు. ఒకప్పుడు వేసవిలో ప్రత్యేక శిక్షణ శిబిరానికి హాజరయ్యే వారు ఆ తర్వాత స్విమ్మింగ్ గురించి పట్టించుకునే వారే కాదు.. అయితే కొన్నేళ్లగా వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు ఆ తర్వాత కూడా స్విమ్మింగ్‌లో మెలకువలు నేర్చుకుని ఉత్తమ స్విమ్మర్‌గా గుర్తింపు పొందడమే కాకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. అటువంటి వారికి కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్ ప్రధాన కేంద్రమైంది..

ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ

ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళ జూనియర్లు, సీనియర్లతో పాటు మహిళలు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు శిక్షణ ఇస్తారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఇక సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు చిన్నారులు, విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఇక రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు పోటీలకు సిద్ధమయ్యే స్విమ్మర్లకు శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో 50 మంది విద్యార్థులు శిక్షణ పొందుతుండగా, పోటీలకు సిద్ధమవుతున్న మరో 20 మంది విద్యార్థులు ఉన్నట్లు కోచ్ రఫీ పేర్కొన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్విమ్మర్లు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఈ ఏడాది ఏప్రిల్‌లో కేరళలో నిర్వహించిన నేషనల్ విభిన్న ప్రతిభావంతుల స్విమ్మింగ్ పోటీలలో కేఎల్ రావు స్విమ్మింగ్‌పూల్‌కు చెందిన మానస 5 మెడల్స్‌ను సాధించింది. 200 మీటర్లు ఫ్రీస్టైల్‌లో, 200 మీటర్ల ఐఎంలో, 100 మీటర్స్ బటర్‌ఫ్లై, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 50 మీటర్ల బెస్ట్ విభాగంలోనూ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ పతకాలను సాధించింది. ఈ ఏడాది జూలై 19, 20వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన 10వ జూనియర్, సబ్ జూనియర్ చాంపియన్ పోటీలలో ఎస్. శృతి హర్షిక పలు పతకాలను సాధించింది. గతేడాది నవంబర్‌లో నరసరావుపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్స్ గేమ్స్ చాంపియన్స్ పోటీలలో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

నగర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు నగర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నగర మేయర్, నగరపాలక సంస్థ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మేయర్ అధ్యక్షతన సోమవారం స్థాయీ సంఘ సాధారణ సమావేశం జరిగింది. తొలుత ఇటీవల నూతనంగా ఎన్నికైన స్థాయీ సంఘ సభ్యులు (ఆరుగురు) మేయర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి వారందరినీ అభినందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ చిత్త శుద్ధితో పని చేయాలని సూచించారు. అనంతరం జరిగిన ఈ స్థాయీ సంఘ సాధారణ సమావేశంలో మొత్తం 24 అంశాలు చర్చకురాగా వాటిల్లో 19 అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. అదే విధంగా ఒక అంశం ధ్రువీకరించబడగా మరో మూడు అంశాలను వాయిదా వేశారు. ఒక అంశం రికార్డ్ చేశారు.



స్థాయీ సంఘ సమావేశంలో చర్చిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, సభ్యులు

వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఆయన తన పర్యటనలో భాగంగా రామలింగేశ్వరనగర్, భూపేష్ గుప్తా నగర్, సాయిరాం కట్‌పీసెస్ రోడ్, తారకరామా నగర్, రణదీవె నగర్ మెట్లబజార్ తదితర ప్రాంతాల్లో సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కృష్ణానదిలో నీటి ప్రవాహం ఎక్కువైతే ఏఏ ప్రాంతాల నుంచి నీరు ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లోకి వస్తాయి, అక్కడ ఇంజినీరింగ్ సిబ్బంది ఏర్పాటు చేసుకోవల్సిన ఎక్కువ సామర్థ్యం గల మోటార్లు, పంపు సెట్లు, ఆయిల్ ఇంజిన్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక వేళ కృష్ణానదిలో ప్రవాహం ఎక్కువై వరదలుగా మారే అవకాశం ఉన్నప్పుడు ప్రజలకు పునరావాస కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో ముందుగానే తెలియపరచాలన్నారు. ఆపద సమయంలో వారు ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బందిపడే పరిస్థితి లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధితుల దగ్గరలో ఉన్న పునరావాస కేంద్రాలను గుర్తించి వాటిల్లో ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ కె.షమ్మి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్న కుమార్, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటు జోనల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఇందులో 24 ఫిర్యాదులు స్వీకరించగా వాటిల్లో పట్టణ ప్రణాళికకు సంబంధించి 11, ఇంజినీరింగ్ 7, రెవెన్యూ 2, ఎస్టేట్ 2, పీఓ యూసీడీ, హార్టీకల్చర్ విభాగానికి ఒక్కో ఫిర్యాదు అందిందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం ఫిర్యాదుదారు దగ్గరకు వెళ్లి వారి సమస్యను తెలుసుకొని అర్థవంతమైన పరిష్కారాన్ని చూపించి ఆ సమస్య తిరిగి తలెత్తకుండా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన, జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ లత, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి.సత్యానారాయణ, డిప్యూటీ డైరెక్టర్(హార్టీకల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

సితార జంక్షన్ వద్ద ఫుడ్‌కోర్ట్ ఏర్పాటు చేయొద్దు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి బైపాస్ రహదారిలోని విద్యాధరపురం సితార జంక్షన్ వద్ద ఫుడ్‌కోర్ట్ ఏర్పాటు చేయొద్దని స్థానిక న్యాయవాది ములకల హనుమాన్, ఎస్ రాము గుప్తా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సోమవారం నగరపాలక సంస్థలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రకు ఫిర్యాదు చేశారు. ఒక వైపు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే బైపాస్ రోడ్, మరో వైపు రోడ్‌కు రెండు పక్కల జనావాసాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో అక్కడ ఫుడ్‌కోర్ట్ ఏర్పాటు చేయడం వలన ట్రాఫిక్ జామ్ అయ్యి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం అధికంగా ఉందన్నారు. ఫుడ్‌కోర్ట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఇటీవలే వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ ఒక ప్రకటన విడుదల చేశారని గుర్తు చేశారు. ఈ విషయంపై పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని, జనావాసాలు లేని ప్రాంతంలో ఫుడ్‌కోర్ట్ ఏర్పాటు చేయాలని కోరారు.

పంచ జ్యోతిర్లింగ దర్శనం, అంబేడ్కర్ యాత్ర

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో భారత దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ఐదు జ్యోతిర్లింగాలను దర్శనంతో పాటు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యాత్ర పేరుతో భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలును సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా ప్రారంభించారు. ఆగస్టు 16 నుంచి 24వ తేదీ వరకు ఎనిమిది రాత్రుళ్లు, తొమ్మిది పగలు సాగే ఈ యాత్రలో నాగ్‌పూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన ప్రదేశమైన దీక్షా భూమి, శ్రీ స్వామి నారాయణ మందిరం దర్శనం, ఉజ్జయినిలోని మహాకాళేశ్వర జ్యోతిర్లింగం, ఓంకారేశ్వర జ్యోతిర్లింగ దర్శనం, అంబేడ్కర్ జన్మస్థలం భీమ్ జన్మభూమి, నాసిక్‌లోని త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం, పూణేలోని భీమశంకర్ జ్యోతిర్లింగం, ఔరంగాబాద్‌లోని గ్రిష్ణేశ్వర జ్యోతిర్లింగ దర్శనం కల్పించారు. ఈ ప్యాకేజీలో స్లీపర్ క్లాస్‌లో ఒక్కొక్కరికి పెద్దలకు రూ. 14,700, పిల్లలకు రూ.13,700, 3 ఏసీ క్లాస్‌లో పెద్దలకు 22,900, పిల్లలకు రూ.21,700, 2 ఏసీలో పెద్దలకు రూ.29,900, పిల్లలకు రూ. 28,400 ధర నిర్ణయించారు. ఆసక్తి కలిగిన యాత్రికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా విజయవాడలోని కార్యాలయం లేదా 92814 95848 ఫోన్ నంబర్ల ద్వారా టికెట్‌లు బుక్ చేసుకోవాలని సూచించారు.

గాయకుల ప్రతిభను గుర్తించాలి



విజయవాడకల్చరల్: గాయకులలోని ప్రతిభను గుర్తించాలని జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో సోమవారం సినీ సంగీత విభావరి, గాయనీ సాహితీవేత్త నాగేశ్వరమ్మకు ఉగాది పురస్కారం అందకున్నందుకు అభినందన సత్కారం నిర్వహించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ కవి సామ్రాట్ విశ్వనాథ పేరుతో పురస్కారం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు, బోడి ఆంజనేయరాజు వివిధ సంస్థల ప్రతినిధులు కే డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ధర్మస్థలి హత్యోదంత ఘటనలపై దర్యాప్తు వేగవంతం చేయాలి

మహిళా సంఘాల ఐక్య వేదిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ధర్మస్థల హత్యోదంత ఘటనల్లో సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య అక్కినేని వనజ మాట్లాడుతూ ధర్మస్థల హత్యోందత ఘటనలు తీవ్ర భయాందోళన కలిగిస్తున్నాయన్నారు. ఈ ఘటనలపై దర్యాప్తు మందకోడిగా సాగుతోందన్నారు. బాధితులకు సరైన న్యాయం జరుగుతుందా అనే అనుమానం కలుగుతోందన్నారు. 1983 నుంచి ఇప్పటి వరకు అదే ప్రాంతంలో అనేక మంది మహిళలు, యువతులు, బాలికలు మిస్ అయిన సంఘటనలున్నాయన్నారు. పలుమార్లు కేసులు దర్యాప్తులు, చట్టసభలలో చర్చలు జరిగాయని తెలిపారు. ఏది సక్రమంగా విచారణ జరగలేదని, ఆర్థిక బలం, అధికార బలంతో వ్యవస్థ లోని లోపాలను ఆధారంగా చేసుకుని దోషులు తప్పించుకున్నారన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సిట్ బృందం తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ ఈ ఘటనలో సమగ్ర దర్యాప్తునకు న్యాయవాదులు, ప్రజలు ఆందోళన చేసిన తరువాత మాత్రమే సిట్ వేశారన్నారు. దానికి కూడా కాలపరిమితిని విధించలేదన్నారు. త్వరితగతిన విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలన్నారు. ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు ఆర్.గంగాభవాని, ఐద్వా నాయకురాలు ఝాన్సీ, మహిళా సంఘాల ప్రతినిధులు పద్మ, పంచదార్ల దుర్గాంబ, ఓర్సు భారతి, బంకా ఝాన్సీ లక్ష్మి, కె.శైలజ, డి.పుష్పావతి, మూలి ఇందిర, చింతాడ పార్వతి, నిలాపు భాగ్యలక్ష్మి, బి.శాంత, నక్కా రాజ్యలక్ష్మి, మేకా పార్వతి, నాగుర్ బి, అనిత, రాణి, భువన సుందరీ, షకీలా పాల్గొన్నారు.



లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న మహిళా సంఘాల నేతలు

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి సబ్ కోటా ఇవ్వాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం డిమాండ్ చేసింది. సోమవారం ధర్నా చౌక్‌లో బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఒక రోజు నిరాహార దీక్ష జరిగింది. మహిళా విభాగ అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ, గౌరవాధ్యక్షురాలు వావిలాల సరళాదేవి మాట్లాడుతూ బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలన్నారు. ఇందుకోసం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరణ చేయాలని కోరారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత చట్టసభలలో 33 శాతంతో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆమోదించిందన్నారు. అయితే బీసీ మహిళలకు సబ్-కోటా కేటాయించకుండానే చట్టం చేసిందన్నారు. కేసన శంకరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల పార్లమెంటు సమావేశంలోనే చట్టసభలలో ఓబీసీల రిజర్వేషన్లతో పాటు మహిళా రిజర్వేషన్ చట్టానికి ఓబీసీ మహిళలకు సబ్ కోటా ఇస్తూ సవరణ చేయాలన్నారు.



విజయవాడ ధర్నా చౌక్‌లో దీక్ష చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఘనంగా మహా కుంభాభిషేకం

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న మహాకుంభాభిషేకం, అష్టబంధన, మహాసంప్రోక్షణ మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమంలో టీటీడీ కంకణ భట్టార్, అర్చకులు వేదాంతం శిఖరాచార్యులు పర్యవేక్షణలో సర్వశాంతిహోమం, సహస్రాహూతి హోమం నిర్వహించారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి, డెప్యూటీ ఏఈ నాగభూషణం, సూపరింటెండెంట్ మల్లికార్జునరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా గోదాదేవి జన్మదిన వేడుకలు



గోదాదేవికి పూజలు చేస్తున్న సత్యశ్రీహరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో సోమవారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యంలో గోదాదేవి జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంతో మహిమాన్వితమైన గోదాదేవి అమ్మవారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరి శుభం జరుగుతుందన్నారు. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యంలో పారాయణం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

నిర్లక్ష్యం చేస్తే హెపటైటిస్ ప్రాణాంతకం

లబ్బీపేట(విజయవాడతూర్పు): లివర్ వ్యాధి హెపటైటిస్‌ను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ఎస్పీఎం విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏడుకొండలరావు మాట్లాడుతూ.. వైరల్ హెపటైటిస్ వ్యాప్తి, ప్రమాద కారకాలు, లక్షణాలు, వైద్య పరీక్షలు, చికిత్స, స్క్రీనింగ్, నివారణ వంటి అంశాలను వివరించారు. చేతుల శుభ్రత, శుభ్రమైన ఆహారం తీసుకోవడం, నిల్వచేసిన ఆహారం తినకుండా ఉండటం, రక్త సంబంధిత పదార్థాలను ముట్టకుండా ఉండటం, రక్త బదిలీలో జాగ్రత్తలు, టీకాల ద్వారా హెపటైటిస్ వ్యాప్తి, కాలేయ క్యాన్సర్ నివారణపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్పీఎం విభాగాధిపతి డాక్టర్ గోవింద్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు వైరల్ హెపటైటిస్‌పై క్విజ్ పోటీలను నిర్వహించారు.



హెపటైటిస్ డే వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు, వైద్యులు గోవింద్, నీలిమ

స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలపై 5న నిరసన

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ భారాలపై ఆగస్ట్ 5న రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు పిలుపునిచ్చారు. భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని సుందరయ్య గ్రంథాలయంలో 40, 41, 42 డివిజన్ల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీకి భిన్నంగా విద్యుత్ చార్జీల భారాలను మోపుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలకొట్టమని చెప్పిన నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన తరువాత అదే స్మార్ట్ మీటర్లను బిగించడం ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా ఉందని మండిపడ్డారు. ఈ అన్యాయంపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆగస్ట్ 5వ తేదీన నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలకు సీపీఎం మద్దతు తెలుపుతుందన్నారు. సమావేశంలో నగర కమిటీ సభ్యుడు ఎస్.సుబ్బారెడ్డి, డివిజన్ నాయకులు కృష్ణారెడ్డి, బి.అచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యబాబు

శక్తి యాప్, గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు శక్తి బృందాలు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి శక్తి యాప్ వలన ప్రయోజనాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలను వివరిస్తున్నారు. అంతేకాకుండా అత్యవసర సమయంలో చేయాల్సిన వివిధ టోల్ ఫ్రీ నంబర్లు కూడా తెలియజేస్తున్నారు. శక్తి బృందాలు సోమవారం పటమట, నిడమానూరు హైస్కూళ్లు, ఎస్ఆర్కే, స్టెల్లా కళాశాలలు, నందిగామ జెడ్పీ స్కూల్స్‌ను సందర్శించి విద్యార్థులు సైబర్‌నేరాలు, సోషల్ మీడియా వంటి అంశాలతో పాటు పోక్సో చట్టం గురించి వివరించి డయల్ 112 పై అవగాహన కల్పించారు.



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): భర్త మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడని కదులూరి దుర్గ ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు 17 సంవత్సరాల క్రితం కదులూరి శ్రీనివాసరావుతో దుర్గకు వివాహం జరిగింది. గత ఏడాది నుంచి ఫిర్యాది భర్త వేరే మహిళతో ఉంటూ ఇబ్బంది పెడుతున్నాడని దుర్గ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.